432) సామంతం/హిందోళ

ప॥ సమబుద్ధే యిందరికి సర్వవేదసారము । సము డిందరికి హరి సాధనమోయయ్యా ॥

చ॥ చీమకు దనజన్మము చేరి సుఖమై తోచు । దోమకు దనజన్మము దొడ్డసుఖము ।
ఆమనియోగకు సుఖ మాజన్మమై తోచు । యేమిటా నెక్కువసుఖ మెవ్వారి కేదయ్యా ॥

చ॥ జంతురాసులకునెల్లా జననము లొక్కటే । అంతటాను మరణము లవియొక్కటే ।
చెంత నాహారనిద్రలు స్త్రీసుఖా లొక్కటే । ఇంతటా నిందుకంటే నెవ్వ రేమి గట్టిరయ్యా ॥

చ॥ ఇందులోన నెవ్వరైనానేమి శ్రీవేంకటపతి- । నందముగా దలచిన దది సుఖము ।
యెందు జూచినా నీత డిందరిలో నంతరాత్మ । చందముగా నెవ్వరికి స్వతంత్రమేదయ్యా ॥